సాక్షి ఏలూరు

గురువారం । 26 । సెప్టెంబర్ । 2024



జీజీహెచ్‌లో టీడీపీ అరాచకాలు

ఏలూరు జీజీహెచ్‌లో టీడీపీ నేతల అరాచకాలతో అధికారులు భయపడుతున్నారు. టీడీపీ నేతల కనుసన్నల్లో వైద్య అధికారులు పనిచేసేలా భయపెడుతున్నారు. 8లో ▸



రఘురామకృష్ణరాజు క్షమాపణ చెప్పాలి


అంబేడ్కర్‌ను అవమానించిన ఎమ్మెల్యే రఘు రామకృష్ణరాజు క్షమాపణ చెప్పాలని దళిత సంఘాల ఆధ్వర్యంలో ఉమ్మడి జిల్లాలో నిరసనలు కొనసాగాయి. 8లో ▸



రూ.9 లక్షలకు టోకరా

ఒక సాఫ్ట్‌వేర్ ఉద్యోగిని సైబర్ నేరగాళ్లు సీబీఐ అధికారులమంటూ బెదిరించి రూ. 9 లక్షల సొమ్ములు కాజేశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. 8లో ▸

లిక్కర్ దందాతో కూటమిలో కిక్కు



- నియోజకవర్గాలవారీగా సిండికేట్లతో ప్రజాప్రతినిధుల డీల్
- లాభాల్లో సగటున 40 నుంచి 70 శాతం ముడుపులివ్వాల్సిందేనని డిమాండ్
- ఎమ్మెల్యేల డిమాండ్లతో అవాక్కవుతున్న లిక్కర్ వ్యాపారులు
- తనకు తెలియకుండా దరఖాస్తు చేయడానికి వీల్లేదని ఓ ఎమ్మెల్యే హుకుం
- మరో నియోజకవర్గంలో షాపులు మొత్తం ఎమ్మెల్యేవే



సాక్షి ప్రతినిధి, ఏలూరు: జిల్లాలో లిక్కర్ దందాకు తెరలేచింది. వైన్ షాపులన్నీ ప్రైవేటు పరం చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిన క్రమంలో కూటమి ప్రజాప్రతినిధులు భారీ ఆదాయ వనరుగా మార్చుకునే ప్రయత్నాలకు తెరదీశారు. దీనిలో భాగంగా రహస్య భేటీలు, నిరంతర పంచాయతీలు, పాత సిండికేట్లకు పరోక్ష హెచ్చరికలు జారీ చేస్తూ కూటమి ప్రజా ప్రతినిధులందరూ లిక్కర్ దందాలో బిజీగా ఉన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా లాభాల్లో 40 నుంచి 70 శాతం వరకు నెలవారీ ముడుపులుగా చెల్లించాలనే కొత్త డిమాండ్‌కు ప్రజాప్రతినిధులు శ్రీకారం చుట్టడంతో వ్యాపారులు అవాక్కవ్వడం జిల్లాలో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. రాష్ట్ర ప్రభుత్వం నూతన మద్యం పాలసీని ఆమోదించింది. ఈ క్రమంలో వచ్చే నెల నుంచి ప్రైవేటు వైన్ షాపులు ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించింది. ఇప్పటికే ఎక్సైజ్ అధికారులు నియోజకవర్గాల వారీగా జనాభా ప్రాతిపదికన షాపుల సంఖ్యను సిద్ధం చేసి గెజిట్ విడుదల కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. ఈ క్రమంలో ఉమ్మడి జిల్లాలో ఒకటి, రెండు నియోజకవర్గాలు మినహా అన్ని నియోజకవర్గాల్లో సగటున 25 నుంచి 40 షాపులు ఏర్పాటు కానున్నాయి. ఏలూరు జిల్లాలో 168, పశ్చిమగోదావరి జిల్లాలో 225 షాపులు ఏర్పాటు కానున్నాయి. వీటిలో ఏలూరు జిల్లాలో 16, పశ్చిమగోదావరి జిల్లాలో 27 గౌడ కులస్తులకు కేటాయిస్తున్నారు. ఈ క్రమంలో టీడీపీ ప్రజాప్రతినిధులు లిక్కర్ వ్యాపారులతో బేరసారాలకు తెరదీశారు. అది కూడా భారీ స్థాయిలో జరుగుతుంది. ప్రతి నియోజకవర్గంలో వైన్‌షాపులు స్థానిక ప్రజాప్రతినిధి కనుసన్నల్లోనే నడవాలి. జనసేన, బీజేపీ ఉన్నచోట టీడీపీ నేతలకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలంటూ ఇప్పటికే ప్రజాప్రతినిధులు బహిరంగంగా మాట్లాడుతున్నారు. ఈ క్రమంలో నియోజకవర్గాలవారీగా ప్రజాప్రతినిధులు బేరాలు ఖరారు చేసుకోవడానికి వీలుగా భారీ పర్సంటేజీలు డిమాండ్ చేస్తున్నారు.

పశ్చిమలో పర్సంటేజీలు ఇలా..

పశ్చిమగోదావరి జిల్లాలో కేవలం రెండు నియోజకవర్గాల్లో మాత్రమే పర్సంటేజీలు ఖరారు చేయలేదు. మిగిలిన అన్ని చోట్ల ప్రజాప్రతినిధుల అనుచరులు, కొత్తగా సిండికేట్‌పై ఆశలు పెట్టుకున్న నేతలు రేట్లు ఖరారు చేశారు. ఓ నియోజకవర్గంలో 42 వైన్‌షాపులు వచ్చే అవకాశం ఉంది. ఎవరైనా వైన్‌షాపుకు దరఖాస్తు చేసుకుని షాపు దక్కించుకోవచ్చు. టర్నోవర్‌పై వచ్చే లాభంలో 75 శాతం ప్రతి ఆరు నెలలకొకసారి చెల్లించాలని డిమాండ్ పెట్టారు. దీంతో సిండికేట్లు పరిస్థితి అర్థం కాక తలలు పట్టుకునే పరిస్థితి. మరో రెండు నియోజకవర్గాల్లో 50 శాతం లాభాల వాటా డిమాండ్ చేశారు. ప్రధాన రహదారుల వెంట ఉంటే మరో నియోజకవర్గంలో సగం షాపులు సొంతమనిషికి, మిగిలిన షాపుల్లో లాభాల్లో వాటాలు ఇవ్వాలని డిమాండ్ కొనసాగుతుంది.

ఏలూరు జిల్లాలో..

జిల్లాలో ఓ ఎమ్మెల్యే అన్ని షాపులు తన టీంకే ఇవ్వాలని.. వేరే ఎవరూ దరఖాస్తులు వేయడానికి వీల్లేదంటూ మద్యం వ్యాపారులందరికీ కబురు పంపారు. మరో నియోజకవర్గంలో 30 నుంచి 40 శాతం కప్పం కట్టాల్సిందేనని తేల్చిచెప్పారు. గెజిట్ నోటిఫికేషన్ విడుదల కాకపోవడం, పూర్తి స్థాయిలో ఖరారు కాకముందే పర్సంటేజీల బేరాలు తీవ్రస్థాయిలో సాగుతుండటం గమనార్హం. ఈ పరిణామాల క్రమంలో బుధవారం బీసీ సంఘ నేతలు కొందరు లిక్కర్ సిండికేట్ల సమావేశం నిర్వహించి అధికారికంగా ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపి అనంతరం ప్రజాప్రతినిధుల డిమాండ్లపై చర్చించి పార్టీ అధిష్టానం దృష్టికి తీసుకువెళ్లాలని నిర్ణయించారు. గౌడ కులస్తులకు కేటాయించిన షాపుల్లోనూ పర్సంటేజీలు డిమాండ్ చేస్తున్నారని కొందరు ప్రస్తావించగా సమావేశానికి హాజరైన ఆచంట ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ అందరూ అప్లికేషన్లు దాఖలు చేయండని.. ఎవరికి రూపాయి కట్టకుండా వ్యాపారం చేసుకుందామని చెప్పినట్లు తెలుస్తుంది.

ఏజెన్సీలో శాంతి భద్రతల సమస్య లేదు



విలేకరులతో మాట్లాడుతున్న ఐజీ అశోక్‌కుమార్

పోలవరం రూరల్: పోలవరం డీఎస్పీ కార్యాలయాన్ని ఏలూరు రేంజ్ ఐజీ జీవీజీ అశోక్ కుమార్ బుధవారం తనిఖీ చేశారు. డీఎస్పీ కార్యాలయ ప్రాంగణాన్ని ఐజీ పరిశీలించారు. కార్యాలయ చుట్టుపక్కల పరిశుభ్రంగా ఉంచుకోవాలని సిబ్బందికి సూచించారు. సబ్ డివిజన్‌లో దర్యాప్తులో ఉన్న కేసులు పరిశీలించి, త్వరితగతిన దర్యాప్తు పూర్తిచేసేలా సూచనలు, సలహాలు ఇచ్చారు. డీఎస్పీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఐజీ మాట్లాడుతూ పోలవరం సబ్ డివిజన్ ప్రాంతంలో లా అండ్ ఆర్డర్ సమస్య లేదన్నారు. కుక్కునూరు, వేలేరుపాడు మండలాలలో మావోయిస్టుల కదలికలు లేనట్లు సమాచారం ఉందన్నారు. ఒడిశా, చత్తీస్‌గఢ్ రాష్ట్రాల్లో ఎన్‌కౌంటర్ల నేపథ్యంలో జిల్లా సరిహద్దు ప్రాంతాలైన పాపికొండలు, ఇతర షెల్టర్ జోన్‌లపై నిఘా ఉంచుతున్నట్లు తెలిపారు. గంజాయి అక్రమ రవాణాలో సరైన సమాచారం లేకపోవడంతో నిందితులను అరెస్టు చేయడంలో కాలయాపన జరుగుతోందన్నారు. డ్రగ్స్ నివారణకు స్కూళ్లు, కాలేజీల్లో అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఏలూరు రేంజ్‌లో సైబర్ క్రైమ్‌పై వెంటనే 1930 కు తెలియచేయాలన్నారు. ఎస్పీ కె.ప్రతాప్ శివ కిషోర్, డీఎస్పీ వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

నవోదయ దరఖాస్తుల గడువు పొడిగింపు

దెందులూరు: జవహర్ నవోదయ స్కూళ్లల్లో 6వ తరగతిలో ప్రవేశానికి దరఖాస్తు గడువు అక్టోబర్ 7 వరకు పొడిగించినట్లు దెందులూరు ఎంఈఓ ఏవీఎస్‌వీ ప్రసాద్ అన్నారు. షెడ్యూల్ ప్రకారం గతంలో ప్రకటించిన గడువు సెప్టెంబర్ 23తో ముగిసిందన్నారు. విద్యార్థులు, తల్లిదండ్రుల విజ్ఞప్తితో ప్రభుత్వం పొడిగించిందన్నారు.

న్యూస్‌రీల్

రోడ్ల అభివృద్ధికి ప్రాధాన్యం



సీసీ డ్రైన్ల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తున్న మంత్రి కొలుసు పార్థసారథి

నూజివీడు: రాష్ట్రంలో దెబ్బతిన్న రోడ్ల అభివృద్ధికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతనిస్తోందని గృహ నిర్మాణ, సమాచార శాఖ మంత్రి కొలుసు పార్థసారథి చెప్పారు. నూజివీడు మండలంలోని సీతారాంపురం, పల్లెర్లమూడి, మీర్జాపురం గ్రామాల్లో రూ.1.70 కోట్లతో నిర్మించనున్న పలు సీసీ రోడ్ల పనులకు మంత్రి పార్థసారథి బుధవారం శంకుస్థాపనలు చేశారు. అనంతరం రూ.23.40 కోట్లతో బొమ్ములూరు వరకు అభివృద్ధి చేసిన రహదారిని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాలు పూర్తిగా తగ్గిన తరవాత నుంచి రోడ్డు అభివృద్ధి పనులు చేపట్టి, త్వరితగతిన పూర్తిచేయాలని అధికారులను ఆదేశించామన్నారు. జిలాల్లోని అన్ని గ్రామాలు, పట్టణ ప్రాంతాలలోని దెబ్బతిన్న రోడ్లను అభివృద్ధి చేస్తామన్నారు. ఆర్ అండ్ బీ ఎస్ఈ జాన్ మోషే, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ భాస్కరరెడ్డి పాల్గొన్నారు.

టీటీసీ పరీక్షలు వాయిదా

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): టెక్నికల్ టీచర్స్ సర్టిఫికెట్ కోర్సు డ్రాయింగ్, ఎంబ్రాయిడరీ, హ్యాండ్‌లూమ్, వీవింగ్ (లోయర్ గ్రేడ్) పరీక్షల్లో ఫెయిల్ అయిన వారికి జరగాల్సిన థియరీ పరీక్షలను ఏపీ టెట్ జూలై-2024 పరీక్షల కారణంగా వాయిదా వేసినట్లు జిల్లా విద్యాశాఖాధికారి ఎస్.అబ్రహం బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పరీక్షలు అక్టోబర్ 27 నుంచి జరుగుతాయని తెలిపారు.

జిల్లాలో 18.8 సగటు మి.మీ వర్షపాతం

ఏలూరు(మెట్రో): అల్పపీడన ప్రభావంతో జిల్లాలో వర్షాలు కురుస్తున్నాయి. జిల్లాలోని 28 మండలాలకు గాను 26 మండలాల్లో వర్షపాతం నమోదైంది. అత్యధికంగా ముసూరు మండలంలో 88.4 మి.మీ వర్షపాతం నమోదు కాగా, అత్యల్పంగా కుక్కునూరు మండలంలో 0.2 మి.మీ వర్షపాతం నమోదైంది. మంగళవారం ఉదయం నుంచి బుధవారం ఉదయం వరకు జిల్లా వ్యాప్తంగా 18.8 మి.మీ వర్షపాతం నమోదైనట్లు వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. జంగారెడ్డిగూడెం, కొయ్యలగూడెం మండలాల్లో వర్షపాతం నమోదు కాలేదు. అత్యధికంగా.. ముసునూరు మండలంలో 88.4 మి.మీ, చింతలపూడి మండలంలో 56.2 మి.మీ, అగిరిపల్లి మండలంలో 48.2 మి.మీ, జీలుగుమిల్లి మండలంలో 45.8 మి.మీ వర్షం కురిసింది.

అందుబాటులో ఎన్‌ఎంఎంఎస్ దరఖాస్తులు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): డిసెంబర్ 8న జరగనున్న నేషనల్ మీన్స్ కం మెరిట్ స్కాలర్‌షిప్ పరీక్ష(ఎన్‌ఎంఎంఎస్)కు దరఖాస్తు చేసుకోవడానికి ఆన్‌లైన్‌లో అప్లికేషన్‌ను ప్రభుత్వ పరీక్ష కార్యాలయంలో వెబ్‌సైట్‌లో ఆగస్టు 5 నుంచి అందుబాటులో ఉంచినట్లు డీఈఓ ఎస్.అబ్రహం ఒక ప్రకటనలో తెలిపారు. పరీక్షల నమోదుకు ఈ ఏడాది అక్టోబర్ 3 వరకు పొడిగించినట్లు తెలిపారు. ప్రింటెడ్ నామినల్ రోల్స్, ఎస్‌బీఐ కలెక్ట్ రసీదు, ప్రధానోపాధ్యాయుల లేఖతో డీఈఓ ఏలూరు కార్యాలయంలో అందజేసేందుకు అక్టోబర్ 14 చివరి తేదీ అన్నారు. వివరాలకు ప్రభుత్వ పరీక్షల సంచాలకుల కార్యాలయం వెబ్‌సైట్‌లోగాని, డీఈఓ కార్యాలయంలోగాని సంప్రదించాలని డీఈఓ తెలిపారు.

ఎక్సైజ్ డీసీగా శ్రీలత

ఏలూరు టౌన్: ఏలూరు జిల్లా ఎక్సైజ్ శాఖ డిప్యూటీ కమిషనర్‌గా బీ.శ్రీలత నియమితులయ్యారు. త్వరలోనే ఆమె విధుల్లో చేరనున్నారు. ప్రస్తుతం కర్నూలు డీసీగా పనిచేస్తున్నారు. ఏలూరు జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ అసిస్టెంట్ కమిషనర్‌గా కేవీ ప్రభుకుమార్ నియమితులయ్యారు. ఆయన బుధవారం ఏలూరులో బాధ్యతలు స్వీకరించారు. ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల పరిధిలో అసిస్టెంట్ కమిషనర్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తారు. జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ అధికారిగా ఏ.ఆవులయ్య బాధ్యతలు స్వీకరించారు.

నెట్‌బాల్ జిల్లా జట్ల ఎంపిక



పాలకోడేరు: గొరగనమూడి స్వామి జ్ఞానానంద హై స్కూల్ క్రీడా ప్రాంగణంలో బుధవారం ఉభయగోదావరి జిల్లా స్కూల్ గేమ్స్ అండర్ 14, అండర్ 17 బాలబాలికల నెట్‌బాల్ జట్ల ఎంపికలు జరిగాయని హెచ్‌ఎం బి.శ్రీదేవి తెలిపారు. 120 మంది క్రీడాకారులు హాజరయ్యారు. జట్లకు ఎంపికైన క్రీడాకారుల వివరాలు వెల్లడించారు. వీరంతా రాష్ట్రస్థాయి పోటీల్లో జిల్లాకు ప్రాతినిధ్యం వహిస్తారన్నారు.

ట్రిపుల్ ఐటీలో సమస్యల పరిష్కారానికి చర్యలు

ఇన్‌చార్జి డైరెక్టర్ సండ్ర అమరేంద్రకుమార్



నూజివీడు: ఏలూరు జిల్లా నూజివీడు ట్రిపుల్ ఐటీలో నెలకొన్న సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తున్నామని ఇన్‌చార్జి డైరెక్టర్ ఆచార్య సండ్ర అమరేంద్రకుమార్ తెలిపారు. స్థానిక ట్రిపుల్‌ఐటీలో బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఇటీవల మెస్‌ల నిర్వహణపై పలు విమర్శలు వచ్చిన నేపథ్యంలో మూడు మెస్‌లలో రెండు మెస్‌ల టెండర్లు రద్దు చేశామని, ఒక మెస్ నడుస్తోందన్నారు. వచ్చే నెల 3 లోపు మెస్‌ల నిర్వహణకు నూతన టెండర్లు పిలుస్తున్నామని, నూతన మెస్ నిర్వాహకులను ఖరారు చేసి నవంబరు 1 నుంచి వారితో విద్యార్థులకు నాణ్యమైన ఆహారాన్ని అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. 2 వేల మంది విద్యార్థులకు ఒక మెస్ ఉండేలా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. 15 రోజులుగా స్టూడెంట్స్‌తో కూడా కమిటీలు ఏర్పాటు చేశామని, ప్రస్తుతం వారే మెస్‌లను మానిటరింగ్ చేస్తున్నారన్నారు. పిల్లలంతా రైస్ బాగోలేదని చెబుతున్నారని, దీనిని త్రిసభ్య కమిటీ దృష్టికి తీసుకెళ్లగా నాణ్యమైన రేషన్ బియ్యాన్ని సరఫరా చేసేలా చూస్తామన్నారన్నారు. విద్యార్థులకు మంగళవారం రాత్రి తయారు చేసిన సాంబార్‌లో కలిపిన శనగ పిండి సరిగా కలవకపోవడం వల్ల పిండిలా వచ్చిందని ఆయన తెలిపారు. సరుకుల నాణ్యతను వారానికొకసారి శాంపిల్స్‌ను ఫుడ్ ఇన్‌స్పెక్టర్ వద్దకు తీసుకెళ్లి పరీక్షిస్తున్నారన్నారు. ప్రస్తుతం ఉన్న సెక్యూరిటీ ఏజన్సీస్ కాంట్రాక్టు పీరియడ్ ముగిసిందని, దానికి మళ్లీ టెండర్లు పిలుస్తామన్నారు.

● మర్యాదపూర్వక భేటీ



వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని తాడేపల్లి కార్యాలయంలో ఏలూరు జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు దూలం నాగేశ్వరరావు(డీఎన్నార్), మాజీ ఎంపీ కోటగిరి శ్రీధర్ బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. జిల్లా పరిధిలోని పలు అంశాలపై చర్చించుకున్నారు. - కైకలూరు

స్వర్ణాంధ్ర-2047లో భాగస్వాములవ్వాలి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ వెట్రిసెల్వి

ఏలూరు(మెట్రో): స్వర్ణాంధ్ర-2047 కార్యక్రమంలో భాగంగా జిల్లాలో రానున్న 5 సంవత్సరాలలో 15 శాతం వృద్ధి రేటు సాధనకు సమాజంలోని అన్ని వర్గాల ప్రజలు భాగస్వాములు కావాలని కలెక్టర్ కె.వెట్రిసెల్వి పిలుపునిచ్చారు. కలెక్టరేట్‌లో స్వర్ణాంధ్ర-2047 జిల్లా ప్రణాళిక కార్యక్రమంలో వివిధ వర్గాల నుంచి సూచనలు స్వీకరించారు. స్వర్ణాంధ్ర ప్రదేశ్ సాధనకు అవసరమైన సూచనలు అందించాలని కోరారు. వ్యవసాయ ఆధారిత జిల్లాలో వ్యవసాయ ఉత్పత్తులతో ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ల ఏర్పాటు ద్వారా రైతులకు అధిక ఆదాయం కల్పించవచ్చని, నూజివీడులో మామిడి ప్రాసెసింగ్ యూనిట్ల ఏర్పాటు ద్వారా విలువ ఆధారిత సేవలతో మామిడి పరిశ్రమకు మరింత అభివృద్ధి సాధించవచ్చన్నారు. చాంబర్స్ అఫ్ కామర్స్ అధ్యక్షుడు నేరెళ్ల రాజేంద్ర, తడికలపూడికి చెందిన గూడూరి వెంకట శివరామకృష్ణ ప్రసాద్, ఏలూరుకు చెందిన ఎస్.అరుణ్ కుమార్‌రెడ్డి, పారిశ్రామికవేత్త రంగారావు తదితరులు మాట్లాడారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ విజయరాజు, పరిశ్రమల శాఖ జీఎం ఆదిశేషు, వ్యవసాయ, మత్స్య శాఖల జేడీలు హబీబ్ బాషా, నాగలింగాచారి పాల్గొన్నారు.

సింగిల్ విండో దరఖాస్తులు పరిష్కరించాలి

ఏలూరు(మెట్రో): పరిశ్రమల ఏర్పాటుకు సింగిల్ విండో ద్వారా అందిన దరఖాస్తులను నిర్దేశించిన సమయంలోగా పరిష్కరించాలని కలెక్టర్ కె.వెట్రిసెల్వి ఆదేశించారు. కలెక్టరేట్‌లోని గౌతమీ సమావేశపు హాలులో బుధవారం జిల్లా పారిశ్రామిక ప్రోత్సాహక మండలి సమావేశం కలెక్టర్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో జిల్లాలో 110 మంది ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు పరిశ్రమల ఏర్పాటుకు అనుమతులు మంజూరు చేశామని చెప్పారు. చిన్న కారణాలతో దరఖాస్తులను తిప్పివేయకుండా పిలిచి వాటిని సరిదిద్దాలన్నారు. పరిశ్రమల కేంద్రం జీఎం ఆదిశేషు, మత్స్య శాఖ జేడీ నాగలింగాచారి, ఉద్యానవన శాఖ డీడీ మోహనరావు, పారిశ్రామిక మౌలిక సదుపాయాల సంస్థ జోనల్ మేనేజర్ బాబ్జి, ఎల్‌డీఎం నీలాద్రి, నాబార్డ్ డీడీఎం అనిల్ కాంత్, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఈఈ వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఫిషింగ్ హార్బర్ నిర్మాణంపై నీలినీడలు

- రూ 429.43 కోట్లతో హార్బర్ నిర్మాణానికి జగన్ సర్కార్ శ్రీకారం
- గత 3 నెలల్లో ఒక్క అడుగు కూడా ముందుకు పడని వైనం
- మత్స్యకారుల్లో ఆందోళన



హార్బర్ లేకపోవడంతో వశిష్ట గోదావరి గట్టున నిలిపిన వేట బోట్లు

నరసాపురం: సుదీర్ఘ తీరప్రాంతం ఉన్న నరసాపురంలో దశాబ్దాల కలగా ఉన్న ఫిషింగ్ హార్బర్ నిర్మాణంపై నీలినీడలు కమ్ముకుంటున్నాయి. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక శ్రద్ధతో జిల్లాకు మంజూరు చేసిన ఈ భారీ ప్రాజెక్ట్ గత మూడు నెలలుగా పడకేసింది. ఎన్నికలకు ముందు పనులు ప్రారంభం కాగా నేడు అసలు హార్బర్ నిర్మాణం జరుగుతుందా? లేదా? అనే సందేహం వ్యక్తమవుతోంది. దీంతో తీరప్రాంత మత్స్యకారులు కూడా ఆందోళన చెందుతున్నారు. ఉమ్మడి పశ్చిమ జిల్లా అభివృద్ధిలోనే గీటురాయిగా మొత్తం గోదావరి జిల్లాలకు మణిహారంగా నరసాపురంలో మేజర్ ఫిషింగ్ హార్బర్ నిర్మాణ పనులను గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చేపట్టింది. నరసాపురం మండలం బియ్యపుతిప్పలో మేజర్ ఫిషింగ్ హార్బర్ నిర్మాణానికి 2022 మే నెలలో ఏపీ మారిటైమ్ బోర్డు టెండర్లు పిలవగా, విశ్వసముద్ర సంస్థ పనులు దక్కించుకుంది. అప్పటి ముఖ్యమంత్రి ప్రత్యేక చొరవ చూపించడంతో ఈ ప్రాజెక్ట్‌కు పర్యావరణ అనుమతులతో పాటు ఇతర సాంకేతిక అనుమతులు కూడా వెంటనే తెప్పించారు. టెండర్లు పిలవడంతో విశ్వసముద్ర సంస్థ పనులు దక్కించుకుంది. రూ.429.43 కోట్లతో నిర్మించే హార్బర్‌కు సంబంధించిన ప్రాథమిక పనులు ఈ ఏడాది ఫిబ్రవరిలో ప్రారంభించారు.

కూటమి సర్కార్ రాకతో పడకేసిన పనులు

కూటమి సర్కార్ వచ్చిన తరువాత ఈ ప్రాజెక్ట్ అంశంలో ఒక్క అడుగు కూడా ముందుకు పడలేదు. ఇప్పటికే టెండర్ల ప్రక్రియ పూర్తికావడం, ప్రాథమికంగా పనులు ప్రారంభమయ్యాయి. కూటమి సర్కార్ గద్దెనెక్కిన తరువాత పనులు చేపట్టడంలో విశ్వసముద్ర సంస్థ వెనకడుగు వేసినట్టు సమాచారం. దీంతో అసలు హార్బర్ కల సాకారమవుతుందా? లేదా? అనే సందేహం వ్యక్తయవుతోంది. 19 కిలోమీటర్లు సముద్ర తీరప్రాంతం ఉన్న నరసాపురంలో బియ్యపుతిప్ప ఫిషింగ్ హార్బర్ నిర్మించాలనే డిమాండ్ దశాబ్దాలుగా ఉంది. ఈ ప్రాంతంలో 5 వేల మత్స్యకార కుటుంబాలు వేటపై ఆధారపడి జీవిస్తున్నాయి.

తీరంలో అపార మత్స్యసంపద

మత్స్య సంపద, ఆక్వా ఎగుమతుల్లో ఉమ్మడి పశ్చిమ జిల్లాకు రాష్ట్రంలోనే ప్రత్యేక స్థానం ఉంది. పశ్చిమ నుంచి దేశ, విదేశాలకు భారీగా ఆక్వా ఎగుమతులు జరుగుతుంటాయి. రొయ్యలు, చేపల సాగు పెరగడం ఆక్వా రంగం పుంజుకుంది. ఏటా కోట్లాది రూపాయల విదేశీ మారకద్రవ్యం ఆక్వా పుణ్యమాని జిల్లాకు వస్తోంది. ఇటు తీరప్రాంతంలో సముద్ర మత్స్యసంపదతో భారీగా ఆదాయం సమకూరుతుంది. ఏటా నరసాపురం తీరంలో రూ.300 కోట్ల విలువచేసే మత్స్య ఎగుమతులు సాగుతాయి. హార్బర్ లాంటి మౌలిక వసతులు ఉంటే మరో 40 శాతం ఎగుమతులు పెరిగే అవకాశం ఉంది. ఈ కారణంతోనే గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం హార్బర్ నిర్మాణానికి పూనుకుంది. బియ్యపుతిప్ప వద్ద ఫిషింగ్ హార్బర్‌ను 600 ఎకరాల విస్తీర్ణంలో రూ.429.43 కోట్లతో నిర్మించ తలపెట్టి పనులు మొదలుపెట్టారు.

హార్బర్ పూర్తి చేయాలి



ఫిషింగ్ హార్బర్‌ను దశాబ్దాలుగా మత్స్యకారులు కోరుతున్నారు. కేంద్ర ప్రభుత్వం ఒప్పుకోకపోయినా రాష్ట్ర ప్రభుత్వమే మొత్తం ఖర్చు భరించేలా నిర్మాణానికి జగన్‌మోహన్‌రెడ్డి నిర్ణయం చేశారు. టెండర్లు పిలిచి, పనులు విశ్వసముద్ర సంస్థకు అప్పగించాం. పనులు ప్రాథమికంగా ప్రారంభమయ్యాయి. హార్బర్ నిర్మాణం చేయాల్సిన బాధ్యత కొత్త ప్రభుత్వం మీద ఉంది. కొత్త ప్రభుత్వం హార్బర్ నిర్మాణం పూర్తిచేస్తే మేం ఆనందిస్తాం.

– ముదునూరి ప్రసాదరాజు, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు

ఎర్ర కాలువలోకి వరద నీరు

జంగారెడ్డిగూడెం రూరల్: మండలంలోని కొంగువారిగూడెం కెకెఎం ఎర్ర కాలువ జలాశయంలోకి వరద నీరు పోటెత్తుతోంది. కురుస్తున్న వర్షాలకు జలాశయంలోకి గంటకు 3,044 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతుండగా డ్యాం గేట్ల ద్వారా గంటకు 1590 క్యూసెక్కుల వరద నీటిని విడుదల చేస్తున్నారు. జలాశయం నీటిమట్టం 83.50 మీటర్లు కాగా ప్రస్తుతం 82.05 మీటర్లు ఉన్నట్లు ఇరిగేషన్ శాఖ డీఈ రాంబాబు తెలిపారు.

క్లుప్తంగా

బైక్‌ల దొంగ అరెస్ట్



విలేకరులతో మాట్లాడుతున్న సీఐ

చాట్రాయి : మోటార్‌సైకిళ్ల చోరీకి పాల్పడుతున్న దొంగను అరెస్టు చేసినట్లు నూజివీడు సీఐ రామకృష్ణ తెలిపారు. బుధవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ పోలవరం గ్రామానికి చెందినకోట రవి పగలు పుచ్చకాయల వ్యాపారం చేస్తూ రాత్రిళ్ల దొంగతనాలకు పాల్పడుతున్నాడని చెప్పారు. మాకు వచ్చిన సమాచారం మేరకు నిందితుడు ఇంటిపై దాడి చేసి 12 ద్విచక్రవాహనాలు, ఒక మేక పోతుని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. కేసు నమోదు చేసి రిమాండ్‌కి తరలించినట్లు ఆయన చెప్పారు. మోటారుసైకిళ్ల రికవరీలో ప్రతిభ చూపిన ఎస్సై రామకృష్ణ, కానిస్టేబుళ్లు ఎం విజయ్ భాస్కర్, విష్ణుకుమార్, కె.గిరిబాబులను అభినందించి నగదు పారితోషికాన్ని అందజేశారు.

సూపర్ సిక్స్ పథకాల అమలు ఎక్కడా..?



కంచాలు మోగిస్తున్న కాంగ్రెస్ నాయకులు

ఏలూరు (టూటౌన్): రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం వచ్చి వంద రోజులు పూర్తయినా ఎన్నికల ముందు ఇచ్చిన సూపర్ సిక్స్ పథకాల అమలు ఎక్కడా అంటూ కాంగ్రెస్ నాయకులు ప్రశ్నిస్తూ బుధవారం ఏలూరు కలెక్టరేట్ వద్ద థాలి బచావో కార్యక్రమాన్ని నిర్వహించారు. ఏలూరు జిల్లా కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి వింతా సంజీవరెడ్డి మాట్లాడుతూ మేము ఏమీ కొత్తగా అడగడం లేదని వారు ఇచ్చిన హామీలే అమలు ఎక్కడా అని ప్రశ్నిస్తున్నట్లు చెప్పారు. జిల్లా అధ్యక్షుడు రాజనాల రామ్మోహనరావు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం గెలిచిన మరుక్షణమే రోడ్లు పోస్తామని హామీ ఇచ్చి.. ఇప్పుడేమో ఇచ్చిన మాటలను గాలికి వదిలేశారని విమర్శించారు. రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి గౌతు సత్యేంద్ర బాబు, మద్దాల ప్రసాద్, అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జిలు తదితరులు పాల్గొన్నారు.

పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నం

పోలవరం రూరల్: పోలవరం మండలం పట్టిసీమ గ్రామానికి చెందిన నాగం అయ్యప్ప అనే వ్యక్తి పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. కుటుంబసభ్యులు గమనించి పోలవరం ప్రభుత్వ వైద్యశాలకు తరలించి చికిత్స అందిస్తున్నారు. కాగా అయ్యప్ప ఆత్మహత్యాయత్నానికి పాల్పడే సమయంలో ఒక వీడియో విడుదల చేశాడు. సీఎం చంద్రబాబు నాయుడు ఉచిత ఇసుక పాలసీ ప్రకటించిన నేపథ్యంలో కొవ్వాడ కాలువలో ఉన్న ఇసుకను ట్రాక్టర్‌తో తీసుకువెళుతుండగా అదే సమయంలో పోలీసులు దాడి చేసి ట్రాక్టర్ సీజ్ చేసి కేసు నమోదు చేశారు. దీంతో మనస్థాపానికి గురై అయ్యప్ప ఆత్మహత్యాయత్నానికి పాల్పడినట్లు చెబుతున్నారు.

జీజీహెచ్‌లో టీడీపీ అరాచకాలు

- పోలీస్ అవుట్ పోస్టుపైనా దౌర్జన్యాలు
- వైద్యం చేసేందుకు భయపడుతున్న వైద్యులు
- సెక్యూరిటీ గార్డులా ? పార్టీ కార్యకర్తలా ?
- వైద్యం కోసం వచ్చినా.. బెదిరింపులేనా
- ఏలూరు ఇలాకాలో.. దెందులూరు ఆగడాలు



ఏలూరు జీజీహెచ్‌లో అత్యవసర సేవల విభాగం

ఏలూరు టౌన్: జిల్లాలో ప్రజలకు అత్యాధునిక వైద్య సేవలు అందించే జీజీహెచ్‌లో టీడీపీ నేతల అరాచకాలతో అధికారులు భయభ్రాంతులకు గురవుతున్నారు. ఏలూరు జిల్లా హాస్పిటల్ ప్రస్తుతం బోధనాసుపత్రిగా మారింది. ఈ నేపథ్యంలో సర్వజన ఆస్పత్రిలో వైద్య నిపుణులు అందుబాటులో ఉండడంతో ప్రతిఒక్కరికీ మెరుగైన వైద్యం అందుతుందని భావించారు. కూటమి ప్రభుత్వం రాకతో పరిస్థితి దారుణంగా తయారైంది. టీడీపీ నేతల కనుసన్నల్లో మాత్రమే వైద్య అధికారులు పనిచేసేలా భయపెడుతున్నారు. వైద్యులను బెదిరించటంతో సరిపెట్టుకోకుండా, కేసులు పెట్టి వేధింపులకు గురిచేస్తున్నారు. అలాగే సెక్యూరిటీ గార్డులు పార్టీ కార్యకర్తల్లా ఇష్టారాజ్యంగా వ్యవహరించడంపైనా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

వైద్యులకు బెదిరింపులు

జీజీహెచ్‌లో వైద్యులకు రక్షణ కరువైందనే అభిప్రాయం వ్యక్తమవుతుంది. కొద్దిరోజుల క్రితం ఒక వైద్యురాలిపై అర్ధరాత్రి సుమారు 1.30 గంటల సమయంలో టీడీపీకి చెందిన ఒక నాయకుడు, కార్యకర్త దౌర్జన్యానికి దిగడం, ఏడు నెలల గర్భిణిగా ఉన్న వైద్యురాలిపైకి దూసుకువెళ్లి ఉద్యోగం ఎలా చేస్తావో చూస్తామంటూ బెదిరించటం పరిస్థితికి అద్దం పడుతోంది. వైద్యురాలు కేసు పెట్టినా వెంటనే కేసు సైతం నమోదు చేయలేదని తెలుస్తోంది. అనంతరం కౌంటర్ కేసుగా టీడీపీ కార్యకర్తలతో వైద్యురాలిపై ఎస్సీ, ఎస్టీ కేసు పెట్టి బెదిరింపులకు దిగారు. అనంతరం ఆస్పత్రిలోని మరో వైద్యుడిపైనా తప్పుడు కేసు పెట్టేలా కార్యకర్తలను రెచ్చగొడుతూ వేధింపులకు గురిచేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఇలాంటి కేసులపై జిల్లా ఎస్పీ సైతం సీరియస్ అయ్యారని సమాచారం.

సెక్యూరిటీ గార్డులపైనా విమర్శలు

ఆస్పత్రిలో సెక్యూరిటీ గార్డులు టీడీపీ కార్యకర్తల్లా వ్యవహరిస్తున్నారనే విమర్శలు పెద్దెత్తున వస్తున్నాయి. వైద్యురాలిపై టీడీపీ కార్యకర్త అర్ధరాత్రి వేళ కొట్టేందుకు వెళుతూ దౌర్జన్యానికి పాల్పడుతున్నా.. సెక్యూరిటీ గార్డులు ఎవరూ కనీసం అడ్డుగా వెళ్లలేదని అంటున్నారు. ఇక కొద్దిరోజుల క్రితం వైఎస్సార్‌సీపీకి చెందిన నాయకుడిపై దాడి జరిగి రక్తం కారుతూ ఆస్పత్రికి వైద్యం కోసం వస్తే అతడిపైనా దురుసుగా ప్రవర్తించటం, టీడీపీ నేతల సూచనలతో బాధితుడిపైనే సెక్యూరిటీ గార్డులు కేసులు పెడతామంటూ బెదిరించటం చూస్తే ఎలాంటి పరిస్థితి ఉందో అర్థం అవుతుంది. అత్యవసర సేవల విభాగం వద్ద పోలీస్ అవుట్‌పోస్టులోని పోలీస్ సిబ్బందిపైనా టీడీపీ నేతలు, కార్యకర్తలు దురుసుగా ప్రవర్తిస్తూ గొడవకు దిగటం కూటమి పాలనకు అద్దం పడుతోంది. ఎమ్మెల్సీ రిపోర్ట్ నమోదు చేస్తున్న పోలీస్ సిబ్బందిపై దూషణలకు దిగుతూ గొడవ చేయటంతో విధుల్లో ఉన్న పోలీస్ సిబ్బంది ఉన్నతాధికారులకు సమాచారం ఇవ్వటంతో వారంతా అక్కడ నుంచి పారిపోయినట్లు తెలుస్తోంది. ఇలా ఏలూరు జీజీహెచ్ టీడీపీ కార్యకర్తలకు అడ్డాగా మారిందనే ఆరోపణలు ఉన్నాయి.

పెచ్చుమీరుతూ..

జీజీహెచ్‌లో ఆయా నియోజకవర్గాలకు చెందిన ప్రజలకు సేవలు అందించేలా ప్రజాప్రతినిధులు తమ కార్యకర్తలను ఏర్పాటు చేసుకున్నారు. ఈ క్రమంలో జీజీహెచ్‌లో దెందులూరు టీడీపీ నేతలు, కార్యకర్తల హడావుడి, ఆగడాలు పెచ్చుమీరుతున్నాయనే అభిప్రాయం ఉంది. ఏలూరులో నిత్యం ఇలా గొడవలు చోటుచేసుకోవటం పరిపాటిగా మారింది. ఏలూరు నియోజకవర్గానికి చెందిన టీడీపీ నేతలు, కార్యకర్తలకు సైతం సరైన ప్రాధాన్యత లేకుండా మొత్తమంతా వారిదే అన్నట్టు వ్యవహరించటంపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. తమ ఇలాకాలో వారి ఆగడాలు ఏమిటంటూ ఏలూరు టీడీపీ కార్యకర్తలు వాపోతున్నారు. వైద్యులు, పోలీసులు, సామాన్యులపై గొడవలకు దిగితే దాని ప్రభావం ఏలూరు నియోజకవర్గంపై పడుతుందని అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

అధికారులు చర్యలు తీసుకోవాలి



ఏలూరు జిల్లా ప్రజలకు అత్యాధునిక వైద్య సేవలు అందించేలా ఏలూరు జీజీహెచ్‌ను అభివృద్ధి చేస్తే.. నేడు ప్రజలకు సాధారణ సేవలు సైతం సరైన రీతిలో అందటం లేదు. ఏలూరు సర్వజన ఆస్పత్రిలో ప్రతిఒక్కరికీ మెరుగైన వైద్య సేవలు అందించేలా జిల్లా అధికారులు చర్యలు చేపట్టాలి. ప్రజాప్రతినిధులు అందరికీ వైద్యం అందిలా ప్రత్యేక శ్రద్ధ వహించాలి. వైఎస్సార్‌సీపీ పాలనలో రాజకీయాలకు అతీతంగా వైద్యం అందించాం.

– మామిళ్లపల్లి జయప్రకాష్, వైఎస్సార్‌సీపీ ఏలూరు సమన్వయకర్త

రఘురామను బర్తరఫ్ చేయాలి



కొయ్యలగూడెంలో అంబేడ్కర్, జగ్జీవన్‌రామ్ విగ్రహాల వద్ద నివాళులర్పిస్తున్న వైఎస్సార్ సీపీ శ్రేణులు

కొయ్యలగూడెం: భారతరత్న బీఆర్ అంబేడ్కర్ ఫ్లెక్సీని చింపి అవమానించిన ఉండి ఎమ్మెల్యే రఘురామకృష్ణరాజుపై ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని, ఎమ్మెల్యే పదవి నుంచి బర్తరఫ్ చేయాలని వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ విభాగం డిమాండ్ చేసింది. బుధవారం కొవ్వూరు రోడ్డులోని అంబేడ్కర్, జగ్జీవన్‌రామ్ విగ్రహాల వద్ద ఎస్సీ సెల్ మండల కన్వీనర్ దూలపల్లి కాంతారావు ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. రఘురామకృష్ణరాజు చేసిన పనికి పశ్చాత్తాపం చెందాల్సింది పోయి దళితులను కించపరిచే విధంగా, రెచ్చగొట్టే విధంగా వ్యాఖ్యలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా కళ్లు తెరిచి భేషరుతుగా అంబేడ్కర్ అభిమానులకు రఘురామకృష్ణరాజు క్షమాపణలు తెలిపి అంబేడ్కర్ విగ్రహానికి క్షీరాభిషేకం చేయాలని సూచించారు. ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి అంబేడ్కర్ చిత్రపటానికి జరిగిన అవమానాన్ని పరిగణలోకి తీసుకోకుండా కాలయాపన చేయడం దళితులను అవమానించడమేనన్నారు ఈ సందర్భంగా అంబేడ్కర్, బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించి శ్రద్ధాంజలి ఘటించారు. అనంతరం జాతీయ ప్రధాన రహదారిపై రఘురామకృష్ణరాజు చర్యలకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ గంజిమాల రామారావు, నాయకులు ముప్పిడి వెంకట్రావు, చిడిపి రవి, ఏలేటి చంద్రం, ఏలేటి భాస్కర్, మారిశెట్టి శ్రీను, చిటికెన నాగార్జున, ఘంటసాల సాయి, తగరం ఆశీర్వాదం, కోడేల్లి అఖిల్, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఇష్టంతో చదవాలి

నూజివీడు: విద్యార్థులు కష్టంతో కాకుండా ఇష్టంతో చదవాలని ఎంపవర్ స్కిల్స్ అకాడమీ ప్రతినిధి కొడాలి ప్రదీప్ పేర్కొన్నారు. నూజివీడు ట్రిపుల్ ఐటీలోని పీయూసీ ప్రథమ సంవత్సరం విద్యార్థులకు బుధవారం ప్రేరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ముందుగా సమయపాలన అలవర్చుకోవాలన్నారు. ప్రతి విషయాన్ని ప్రణాళికాబద్ధంగా ఆలోచించి ఆచరించాలన్నారు. ఏకాగ్రతతో చదివితే మరింత ముందుకు వెళ్లగలరని విద్యార్థులకు సూచించారు. సంస్థకు చెందిన మరో ఇరువురు ప్రతినిధులు కొల్లూరు వెంకట్, నందకిషోర్ మాట్లాడుతూ జీవితంలో కష్టపడి ఉన్నత స్థానాలకు ఎదిగిన గొప్ప వ్యక్తుల జీవిత చరిత్రలను తరచూ చదువుతూ స్ఫూర్తి పొందాలన్నారు. పర్సనాలిటీ డెవలప్‌మెంట్, స్టడీ స్కిల్స్ తదితర విషయాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో స్టూడెంట్ కన్వీనర్ నాగార్జునదేవి, స్టూడెంట్ డీన్ వెల్ఫేర్ అధికారులు ఏ బ్రహ్మస్వాములు, టీ దుర్గాభవాని తదితరులు పాల్గొన్నారు.

బీసీ ఎంపీల రాజీనామా విచారకరం

పాలకొల్లు అర్బన్: వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి సామాజిక న్యాయం పేరుతో బీసీలకు రాజ్యసభలో మాట్లాడే అవకాశం కల్పిస్తే ఆ పదవులకు న్యాయం చేయకుండా రాజీనామాలు చేయడం పట్ల జాతీయ బీసీ ప్రజా సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు గూడూరి వెంకటేశ్వరరావు విచారం వ్యక్తం చేశారు. పాలకొల్లు ప్రెస్‌క్లబ్‌లో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. రాజ్యసభ సభ్యులు మోపిదేవి వెంకటరమణ, బీద మస్తాన్‌రావు, ఆర్ కృష్ణయ్య రాజ్యసభకు రాజీనామాలు చేయడం యావత్ బీసీలకు నష్టమన్నారు. రాజ్యసభలో ఖాళీ అయిన సీట్లను ఆయా రాజకీయ పార్టీలు బీసీ సామాజిక వర్గాలతో భర్తీ చేయాలని వెంకటేశ్వరరావు డిమాండ్ చేశారు.

ఎస్సైపై క్రమశిక్షణ చర్యలకు సిఫార్సు

నూజివీడు: స్పెషల్ మేజిస్ట్రేట్ కోర్టులో పెండింగ్‌లో ఉన్న పలు క్రిమినల్ కేసులలో సాక్ష్యం ఇవ్వకుండా కోర్టుకు గైర్హాజరవుతున్న ఏలూరు రూరల్ ఎస్సై రాజారెడ్డిపై శాఖాపరమైన క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని నూజివీడు స్పెషల్ మేజిస్ట్రేట్ వేల్పుల కృష్ణమూర్తి బుధవారం ఏలూరు రేంజ్ డీఐజీకి, ఎస్పీలకు సిఫార్సు చేశారు. గతంలో ముసునూరు ఎస్సైగా పనిచేసిన రాజారెడ్డి పలు కేసులకు సంబంధించిన చార్జిషీట్లు దాఖలు చేయగా, ప్రస్తుతం అవి విచారణ దశలో ఉన్నాయి. ఈ దశలో ఎస్సై కోర్టుకు రాకుండా ఏదో ఒక కారణాన్ని చూపుతూ గైర్హాజరవుతుండగా సమన్లు సైతం జారీ చేశారు. అయినా కోర్టుకు రాకుండా వాయిదాలు అడుగుతున్నారు. విచారణ చివరి దశలో ఉన్న కేసులు ఎస్సై కారణంగా వాయిదా పడుతున్నందున రాజారెడ్డిపై క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని పోలీసు ఉన్నతాధికారులకు సిఫార్సు చేశారు.

మృతదేహం చేనేత కార్మికుడిదిగా గుర్తింపు

కైకలూరు: వింజరం లాకుల వద్ద ఈ నెల 21న ఎగువ నుంచి గుర్తు తెలియని మగ మృతదేహం కొట్టుకువచ్చింది. వీఆర్వో ఫిర్యాదుపై కైకలూరు టౌన్ సీఐ పి.కృష్ణ మృతదేహాన్ని కైకలూరు ప్రభుత్వాసుపత్రిలో భద్రపర్చారు. పత్రికలలో వచ్చిన కథనాలు చూసి కుటుంబ సభ్యులు గుర్తించారు. తూర్పుగోదావరి జిల్లా అనపర్తి మండలం కుతుకులూరు గ్రామానికి చెందిన చేనేత కార్మికుడు నక్కిన నాగభూషణం(47)గా తేలింది. తెలంగాణలో బంధువుల ఇంటికి వెళ్లి ఈ నెల 1న నాగభూషణం తిరిగి వస్తుండగా మహబూబ్‌నగర్ వద్ద రాళ్లవాగును దాటుతుండగా ఒక్కసారిగా ఉధృతి పెరిగి కొట్టుకుపోయాడు. మున్నేరువాగు ద్వారా కైకలూరు మండలం వింజరం లాకుల వద్దకు మృతదేహం కొట్టుకువచ్చింది. మృతుడి భార్య, కుమార్తె బుధవారం కైకలూరు వచ్చి మృతదేహాన్ని గుర్తించారు. తండ్రి చేతి వేలు ఒకటి చిలుక ఆకారంలో ఉండటాన్ని కుమార్తె గుర్తించింది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించినట్లు సీఐ తెలిపారు.

ప్రతి రైతుకు టార్పాలిన్ పట్టా పంపిణీ



గోపవరంలో ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులను పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి షేక్ హబీబ్ బాషా

కైకలూరు: వర్షాల నుంచి ధాన్యం కుప్పలను రక్షించుకోవడానికి జిల్లాలో ప్రతి రైతుకు వ్యవసాయశాఖ ద్వారా టార్పాలిన్ పట్టాను పంపిణీ చేస్తామని జిల్లా వ్యవసాయాధికారి షేక్ హబీబ్ బాషా చెప్పారు. పొలం పిలుస్తోంది కార్యక్రమం గోపవరం సొసైటీ కార్యాలయం వద్ద బుధవారం జరిగింది. కైకలూరు వ్యవసాయశాఖ సహాయ సంచాలకులు ఆర్.గంగాధరరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయాధికారి మాట్లాడుతూ అక్టోబరు 7వ తేదీ నుంచి ధాన్యం కొనుగోలు ప్రారంభిస్తామన్నారు. గన్నీబ్యాగ్‌లు, తేమ కొలిచే మెషీన్లు, అన్ని సిద్ధంగా ఉంచుతామన్నారు. పశుసంవర్ధక శాఖ సహాయ సంచాలకులు పఠాన్ ముస్తాఫాఖాన్ మాట్లాడుతూ రూ.500 చెల్లిస్తే పెయ్యి దూడలు పుట్టించే సిరం చేస్తామని తెలిపారు. పీకేసీసీ పథకం ద్వారా రూ.30,000 బ్యాంకులు మేత లోన్స్ అందిస్తాయని చెప్పారు. మత్స్యశాఖ అభివృద్ధి అధికారి ఎం.భవిత మాట్లాడారు. సర్పంచ్ ఉలిసి వసంతకుమారి తదితరులు పాల్గొన్నారు.

ఇద్దరు దొంగలకు జైలు

కైకలూరు: దొంగసొత్తును కలిగిన నేరం రుజువు కావడంతో ఇరువురు దొంగలకు రిమాండ్ కాలాన్ని జైలుశిక్షగా పరిగణిస్తూ కైకలూరు జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ ఎం.శివకిరణ్ బుధవారం తీర్పు వెలువరించారు. కేసు విషయాలను కైకలూరు టౌన్ ఎస్సై పి.కృష్ణ వివరించారు. కైకలూరు – ఏలూరు రోడ్‌లో జగనన్న గ్రీన్ విలేజ్ కాలనీలో 2022 నవంబరులో రామకృష్ణకు చెందిన ఇంటిలో దొంగతనం జరిగి బంగారం, నగదు చోరీకి గురయ్యింది. బాధితుడి ఫిర్యాదు మేరకు అప్పటి సీఐ ఆకుల రఘు, ఎస్సై ప్రతాప్‌రెడ్డి కేసు నమోదు చేశారన్నారు. ఈ కేసులో ఏ-1గా అత్తోటి జాన్‌పాల్ (19), ఏలూరు, ఏ-2గా గౌతు శేషు (21), ఏ-3గా కొట్టారు వాసు (34)లను నిందితులుగా చేరుస్తూ చార్జీషీటు దాఖలు చేసారన్నారు. ఈ కేసులో జాన్‌పాల్ 97 రోజులు, గౌతు శేషు 142 రోజులు రిమాండ్ అనుభవించారన్నారు. కొట్టారు వాసుపై నేరం రుజువు కానుందన జడ్జి కేసును కొట్టివేశారు. ప్రాసిక్యూషన్ తరుపున గంగామణి వాదనలు వినిపించారు. సాక్షులను ప్రవేశపెట్టడంలో సీఐ పి.కృష్ణ, కోర్టు కానిస్టేబుల్ పోతురాజు చూపిన చొరవను అభినందించారు.

బాస్కెట్‌బాల్ బాలికల జిల్లా జట్ల ఎంపిక



అండర్-14, 17 జిల్లా జట్లకు ఎంపికైన బాలికలు

ఏలూరు రూరల్: ఏలూరులో స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్) అండర్ 14, 17 జిల్లా బాస్కెట్‌బాల్ బాలికల జట్ల ఎంపిక పోటీలు జరిగాయి. స్థానిక కస్తూరిబా బాలికల ప్రభుత్వ పాఠశాలలో నిర్వహించిన ఈ పోటీలను ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి అలివేలు పర్యవేక్షించారు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి సుమారు 100 మంది బాలికలు పోటీలకు తరలివచ్చారు. జిల్లా బాస్కెట్‌బాల్ అసోసియేషన్ కార్యదర్శి గవ్వ శ్రీనివాస్, కోశాధికారి కె మురళీకృష్ణ, సెయింట్‌థెరిస్సా వ్యాయామ ఉపాధ్యాయురాలు మురళీ సెలక్షన్ కమిటీ సభ్యులుగా వ్యవహరించారు.

అండర్–17 బాలికల జట్టు : పి నందిని, జి ఏసమ్మ, డి అమృత, జి సరిత, టి పూజిత, పి లహరి, సీహెచ్ కీర్తి, కె రుచిక, కె కార్తీక, కె జస్వని, ఎంవీడీ భార్గవి, టి సుమతో పాటు స్టాండ్‌బైగా పి సత్యశ్రీ, ఎస్ సింగ్‌భవాని, ఏ రోహిన, పి జీతిక ఎంపికయ్యారు.

అండర్–14 జట్టు : పి మహేశ్వరి, ఎం యోగశ్రీ, డి డింపుల్, జి హోమజరమణి, పి శాంతిసులోచన, ఎం హేమశ్రీ, టి శ్రావణి, పి గీతాశరణ్య, ఎస్ శాత్విక, ఎం పూర్వశ్రీ, కె నాస్య, జి రత్నహారిక, స్టాండ్‌బైగా కె యజ్ఞస్వరూపిణి, జి జస్విత, జి రేణుకదేవి, ఎం దేదీప్య ఎంపికయ్యారు.

సీబీఐ అని బెదిరించి రూ.9 లక్షలకు టోకరా

ఏలూరు టౌన్: ఒక సాఫ్ట్‌వేర్ ఉద్యోగిని సైబర్ నేరగాళ్లు సీబీఐ అధికారులమంటూ బెదిరించి భారీగా సొమ్ములు కాజేశారు. వివరాలు ఇలా ఉన్నాయి. ఏలూరు శ్రీరామ్ నగర్ 6వ రోడ్డుకు చెందిన మహ్మద్ రాహిల్ సాఫ్ట్‌వేర్ ఉద్యోగిగా పనిచేస్తున్నాడు. ఈ నెల 23న ఉదయం ఇంట్లో విధులు నిర్వర్తిస్తున్న క్రమంలో ఒక గుర్తు తెలియని వ్యక్తి ఫోన్ చేసి తాను ట్రాయ్ నుంచి మాట్లాడుతున్నానని, మీరు చట్టవ్యతిరేక కార్యకలాపాలకు ఈ ఫోన్ నెంబర్‌ను వినియోగిస్తున్నారంటూ బెదిరించాడు. ఇదే సందర్భంలో ఫోన్‌కాల్‌ను మరొకరికి కనెక్ట్ చేయగా వారు తాము ముంబై సీబీఐ పోలీసులమంటూ బెదిరించారు. వీడియోకాల్ చేసి ఆధార్ కార్డు, అతని పూర్తి వివరాలు చెప్పడంతో బాధితుడు కంగారుపడ్డాడు. నీపై చట్టపరంగా చర్యలు తీసుకోవాల్సి ఉంటుందని, కేసు లేకుండా చేయాలంటే రూ.9 లక్షలు వేయాలని బెదిరించాడు. దీంతో బాధితుడు కాన్పూర్ మార్కెట్ ఏరియాలోని సీఎస్‌బీఐ బ్యాంక్ అకౌంట్‌కు రూ.9 లక్షలు నగదును బదిలీ చేశాడు. అనంతరం షాక్ నుంచి తేరుకుని తాను మోసపోయానని గుర్తించి ఏలూరు త్రీటౌన్ పోలీసులను ఆశ్రయించగా సీఐ కోటేశ్వరరావు ఆధ్వర్యంలో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నారు.

గ్యాస్ సిలిండర్ పేలి ఇల్లు దగ్ధం

చింతలపూడి: చింతలపూడి మండలం, రాఘవాపురం గ్రామానికి చెందిన చిమ్మపూడి నాగరాజు అనే వ్యక్తి ఇంట్లో బుధవారం గ్యాస్ సిలెండర్ లీకయ్యి పేలడంతో ఇల్లు పూర్తిగా ధ్వంసం అయ్యింది. ఇంట్లో ఉన్న విలువైన వస్తువులు, నిత్యావసరాలు, దుస్తులు మంటలకు కాలి బూడిదయ్యాయి. పేలుడు సమయంలో అదృష్టవశాత్తూ ఇంట్లో ఎవరూ లేకపోవడంతో ప్రాణనష్టం తప్పింది. అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. చింతలపూడి సీఐ రవీంద్ర నాయక్ ఘటనా స్థలాన్ని పరిశీలించి బాధితుల నుంచి వివరాలను సేకరించారు.